# కథకుడి కథ

— ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఇప్పుడైతే ఓ సినీ నిర్మాత అయ్యేడుగాని కిరీటి నాకు చిన్నప్పట్నించీతెల్సు - అతని దృష్టే వేరుగా ఉండేది - ఏ పని చేసినా అందులో లాభ నష్టాల బేరీజు వేసుకుంటేనేగాని చేసేవాడు కాదు.

డబ్బూ, వ్యాపారాభిరుచీ రెండూ ఉండడం వల్ల చదువు మధ్యలో ఆపేసినా ఎన్నో వ్యాపారాలు చేసి ఎన్నో లక్షలు గడించేడు - ఇప్పుడు సినీ వ్యాపారంలోకి దిగేడు.

ఆర్నెల్ల క్రితం సైన్సు కాన్ఫరెన్స్‌కి మద్రాసు వెళ్తే అక్కడ అనుకోకుండా ఎదురయ్యేడు - నా సంగతులు తెల్సుకుని తన వివరాలు చెప్పేడు. ప్రేక్షకుల అభిరుచి తెల్సుకుంటే సినీ పరిశ్రమ లాభసాటిదే అని చెబుతూ చాలా ఆలస్యంగా ఆ వ్యాపారంలోకి అడుగు పెట్టినందుకు కాస్తంత విచారం వెలిబుచ్చాడు - అతని వ్యవహారం మద్రాసులో మూడు కార్లూ, నాలుగు మేడలుగా వర్ధిల్లుతూన్నందుకు సంతోషమనిపించింది.

"మద్రాసు వచ్చినప్పుడల్లా నన్ను కల్సుకోకుండా వెళ్ళడానికి వీల్లేదు" అంటూ తన అడ్రసు కార్డు యిచ్చేడు.

అలా ఈ ఆర్నెల్లలోనూ ఇది రెండోమారు కిరీటిని కలవడం.

స్నేహమంటే ప్రాణం పెడతాడు - ఎంతైనా చిన్ననాటి స్నేహితులంగదా. తూరీగల్ని పట్టుకొని వాటి తోకలకు దారాలు బిగించడం దగ్గర్నించి స్కూల్లో శైలజ జడ లాగడం వరకూ అన్నీ ముచ్చటించుకుంటూ, చిన్ననాటి సంఘటనలను దర్శించుకుంటూ ఆనందిస్తున్నాం.

ఈలోగా ఇంటర్‌కమ్ ఆహ్లాదమైన ధ్వనితో మోగింది.

రిసీవర్ని చేతులోకి తీసుకొని 'సరే పంపించు' అని చెప్పి పెట్టేశాడు.

మరో రెండు క్షణాల్లో ఓ వ్యక్తి తలుపు తోసుకుని లోపలి కొచ్చాడు. మనిషి సాదాగా ఉన్నాడు. ఎక్కడో చూసినట్టయింది నాకు - వస్తూనే కిరీటికి రెండు చేతులతోనూ నమస్కారం చేశాడతడు.

"రండి రండి" అంటూ నవ్వుతూనే ఆహ్వానించి, కూర్చోమని చెప్పి కుశల ప్రశ్న వేశాడు కిరీటి.

అతను మామూలుగానే సమాధానం చెప్పాడు.

"కొత్తవేమైనా రాశారా" అడిగాడు కిరీటి.

అప్పుడు గుర్తొచ్చింది నాకు తొలిసారి అతగాణ్ణి ఎక్కడ చూసిందీనూ.

"ఏవో రాస్తున్నాను లెండి" — అని చెప్పి ఆ రచనలు ఏఏ పత్రికల్లో వచ్చేదీ చెప్పాడతను.

'రొటీన్ సబ్జెక్టు కాక కొత్త సబ్జెక్టయితే చెప్పండి' అన్నాడు కిరీటి.

"మీ దగ్గరొకటుందిగా - దాని విషయం కనుక్కోడానికే వచ్చాను. సీరియల్‌గా వచ్చిన నవల కాబట్టి దాని గురించి అందరికీ తెల్సింది - ఒకరిద్దరు అడిగారు కూడా" అన్నాడతను నసుగుతూనే-

"తియ్యాలనే తీసుకున్నాంగా - కాస్త టైం పట్టేలా వుంది. నేననుకున్న డైరక్టర్లంతా బిజీగానే వున్నారు. మీరు దాని గురించేం వర్రీ కాకండి. తల్చుకోవాలేగాని మీకు సబ్జెక్టులకే కొదవా" — అంటూ సినిమా తీయడానికి మరో ఆరేడు నెలలు పట్టొచ్చునని తేల్చేశాడు కిరీటి.

అతగాడి ముఖంలో ఆత్రుత తప్ప ఏ భావమూ లేదు - కిరీటి దగ్గర సెలవు పుచ్చుకుని అతను వెళ్ళిపోయాక నా వంక తిరిగి 'సారీ చిన్న బిజినెస్సు-' అని "ఏం మాట్లాడుతున్నాం" అన్నాడు.

"ఆ వచ్చినాయన రచయిత కదూ - మొదటిసారి వచ్చినపుడు కూడా ఇక్కడే చూసినట్లు గుర్తు-" అన్నాను.

"ఆ. అతని నవలొకటి సినిమా కోసం కొనాలనుకున్నాం. అందుకోసమే పట్టువదలని విక్రమార్కుడిలా తిరుగుతున్నాడు."

"బావుంటే కొనెయ్యలేక పోయావా! పాపం అతను మాత్రం ఎన్నిసార్లు తిరుగుతాడూ" అన్నాను చనువుగా.

"కొన్నట్టే - అడ్వాన్సుగా వెయ్యి రూపాయిలిచ్చి స్క్రిప్టు తీసుకున్నాం."

"మరి? సినిమా తీస్తున్నట్లేనా?" అడిగాను ఆత్రంగా.

"ఏమో! చెప్పలేం."

"అదేంటి! - డబ్బు కూడా అడ్వాన్సు ఇచ్చేశారుగా. మరి తియ్యకపోవడం కూడా వుంటుందా?" అన్నాను.

కిరీటి నవ్వేశాడు.

"శేషూ - ఇదో బిజినెస్సు - ఇందులో ట్రెండ్స్ బట్టి సినిమాల కథలు మారిపోతూంటాయి - వెయ్యి రూపాయిలచ్చామని సినిమా తీసేస్తే పాతిక లక్షలకి మునిగి పోతాం."

"మరి అటువంటప్పుడు ఆ వెయ్యి మాత్రం నష్టపెట్టుకోడమెందుకు" అడిగాను అమాయకంగా.

అదే అసలు వ్యాపార రహస్యం - కథ బాగుందీ అంటే వెంటనే కొనేస్తాం - ఓ మూల పడేస్తాం - అలా కొన్న వాటిల్లో ట్రెండ్సు బట్టి సినిమా తీస్తే తీయొచ్చు - లేదా అవేవీగాని కొత్త కథని వాటిల్లోంచే తయారు చేసి తీయొచ్చు."

"మరి ఏ కథ బాగుందో నీ కెలా తెలుస్తుంది? అన్నీ చదూతుంటావా?" అడిగాను.

"అబ్బే అలా అయితే చచ్చూరుకోనూ?" మా కుటుంబ సభ్యులే న్యాయ నిర్ణేతలు - అన్ని దిన వార మాస పత్రికలు కొని ఇంట్లో పడేస్తాను - మా శ్రీమతి టేస్టు వేరు - మా అమ్మాయి టేస్టు వేరు - మా అబ్బాయిలు పత్రికలు చదవర్లే - ఇక మా అమ్మ - పాతకాలంది కదా - ఆవిడ ఇష్టాలు వేరు - వీళ్ళు ముగ్గురూ ఇప్పుడు వస్తున్న కథా నవలా సాహిత్యం చదివి ఏవైనా బాగుంటే నాకు చెబుతారు - కథ క్లుప్తంగా విని బాగుంటే కొని పడేస్తాను - అలా కొన్నదే ఇప్పుడొచ్చిన ఆసామీ నవల - మా ఆవిడ యిష్టపడిందా కథ."

"ఇటువంటి కథ లెన్నుంటాయి నీ దగ్గర"

"దాదాపు పది సబ్జెక్ట్సు పెండింగ్‌లో వున్నాయి."

"మరి నువ్వు తియ్యకపోతే పాపం ఆ రచయితలు నష్టపోరా? మరొక ప్రొడ్యూసర్‌కి యివ్వడానికి కూడా వారికి కుదరదుగా" అన్నాను.

"చెప్పానుగా అదే అసలు సిసలైన వ్యాపార రహస్యం. మనకి పనికి రాకపోయినా మరొకరికి పనికిరాకూడదు. ఏ సబ్జెక్టులో ఎవడి అదృష్టం దాగుందో ఎవరికి తెల్సు. ఒక వేళ మనం తియ్యదల్చుకోలేని ఏ కథయినా ఇంకొకరికి కావల్సి వచ్చిందనుకో - అప్పుడు రచయితకి త్రుణమో ఫణమో యిచ్చి సెటిల్ చేసేసి, ఆ తర్వాత లాభానికా కథ కావల్సిన వాడి కమ్మేస్తాం - అది మరో రకంగా వ్యాపారమే. ఫీల్డు అంతా కాంపిటీషను మీద నడుస్తోంది-" అన్నాడు.

"దీన్నిబట్టి పది మంది రచయితల్లో ఒక్కరికే న్యాయం జరుగుతుందేమో - మిగిలిన వాళ్ళందర్నీ మోసపుచ్చినట్లేగా అన్యాయమే" అన్నాను.

"ఏ వ్యాపారంలోనైనా కొంత అన్యాయం తప్పదు - రచయితలు మరీ నష్టపోకుండా వుండేందుకే అడ్వాన్సు సొమ్ము యిస్తున్నది-" అన్నాడు కిరీటి.

సమాజంలోని అవకతవకల్నీ అన్యాయాల్నీ తన రచనల్లోవిప్పి చెప్పి ప్రజలకు మార్గ దర్శకుడయ్యే రచయిత ఇంత అమాయకంగా మోసపోతున్నాడా అనిపించింది ●

## జనారణ్యంలో అశ్రుగానం

చలికి సూర్యుడికి కప్పిన ఎర్రశాలువా
తూర్పు సంధ్య తొలగించి మేల్కొల్పింది
తను లేవక ముందే నిద్రలేచి నడుస్తున్న
లోకాన్ని చూసి
జాలిపడి సూర్యుడు విధ్యుక్త కార్యానికి ఉద్యుక్తుడయ్యాడు
దేశ సంపద అరవై కుటుంబాలకే హస్తగతమైనట్టు
నగర వాసుల ప్రాణాలు
సిటీ బస్సుల చక్రగతమై పరిభ్రమిస్తున్నాయి!
చక్రాలేగాని బ్రేకుల్లేని బస్సుల మధ్య
ప్రాణాలు ఇనప్పెట్టెల్లో దాచుకున్నా
ఫలితం దక్కకుండా వుంది
భవిష్యత్తును బ్యాగులో దాచి
మరణ మృదంగాల మధ్య
అక్షరాభ్యాసం కోసం జనారణ్యంలో
అడుగులు వేస్తున్న బాలుని బ్రతుకు
అదుపు తప్పిన బండి కింద అర్థాంతరంగా ముగిసి
నల్లని రోడ్డు మందారంలా మారింది!
జన నియంత్రణే లక్ష్యమై రవాణాధికార్లు
నగరాన్ని నేరస్తులకు అంకితం చేసిన పోలీసు యంత్రాంగం
తప్పొప్పుల పట్టికలో
ఒప్పుల కిరీటం తప్పులకు కట్టబెట్టి జారుకొంది!
మనఃక్లేశాన మరణించిన సూర్యుడిపై నల్లశాలువా కప్పి
పడమటి సంధ్య రోదిస్తూ వుంది
చనిపోయిన బాలుని శవం అంతిమయాత్రకు బయలుదేరగా
చంపిన బస్సు స్వైర విహారానికి కదిలి ఎదురైంది!

— అడిగోపుల వెంకటరత్నమ్